https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 01 సంచిక : 334 శుక్రవారం 20-2-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం
Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో
నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా
రాయాలని కోరుకుంటున్నారా?
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో
పనిచేసేందుకు విలేఖరులు కావలెను...
మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు
9989788438, 9505485656.

## ఏఐ నియంత్రణ మన

# చేతుల్లో ఉండాలి

## కృత్రిమ మేధ ప్రజలకు అందుబాటులోకి రావాలి

**మానవాళికి ప్రయోజనం చేకూర్చడమే లక్ష్యం కావాలి**

**నాగరికత దిశ మార్చిన నిప్పు, లిపిలాంటిదే ఏఐ కూడా!**

**భారత్ ఏఐలో భయాన్ని కాదు.. అదృష్టాన్ని చూస్తోంది**

**ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో ప్రధాని నరేంద్ర మోదీ**

**కృత్రిమ మేధకు సంబంధించి 'మానవ్' విజన్ ఆవిష్కరణ**




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: నానాటికీ విస్తరిస్తున్న కృత్రిమ మేధ పరిజ్ఞానం కొన్ని పెద్ద దేశాలకో, అంతర్జాతీయ కంపెనీలకో మాత్రమే పరిమితం కాకూడదని.. దాన్ని అందరికీ అందుబాటులోకి తేవాలని.. ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. అయితే దానిపై నియంత్రణ మాత్రం మన చేతుల్లోనే ఉండాలని ఆయన స్పష్టం చేశారు. "ఏఐకి మనం పూర్తిస్థాయిలో అవకాశం ఇవ్వాలి. కానీ నియంత్రణ మాత్రం మన చేతుల్లోనే ఉంచుకోవాలి.. అచ్చం జీపీఎ?సలాగా. అది మనకు మార్గాలను సూచిస్తుంది. కానీ ఎలా వెళ్లాలనే తుది నిర్ణయం మనదే కదా" అని వివరించారు. ఢిల్లీలో జరుగుతున్న 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్'లో గురువారం ప్రసంగించిన మోదీ.. ప్రపంచ జనాభాలో ఆరో వంతు మందికి ప్రాతినిధ్యం వహిస్తున్న భారత్‌లో ఈ సదస్సు జరగడం ఇండియాకే కాక, గ్లోబల్ సౌత్‌కు గర్వకారణమన్నారు. వ్యవసాయం, భద్రత, దివ్యాంగులకు సహాయం వంటి అంశాలకు సంబంధించి ఈ సమ్మిట్‌లో పలు కంపెనీలు ప్రదర్శించిన పరిష్కారాలు 'మేడ్ ఇన్ ఇండియా' శక్తికి, దేశ ఆవిష్కరణ సామర్థ్యాలకు శక్తివంతమైన ఉదాహరణలని పేర్కొన్నారు. ఈ సదస్సులో 3 భారత కంపెనీలు తమ స్వంత ఏఐ మోడళ్లను, యాప్‌లను ప్రారంభించాయని చెప్పడానికి తాను గర్విస్తున్నానన్నారు. ఏఐ వినియోగం మానవాళికి ప్రయోజనం చేకూర్చడమే లక్ష్యంగా (హ్యూమన్ సెంట్రిక్‌గా) ఉండాలని అభిప్రాయపడ్డారు. "మానవ చరిత్రలో ప్రతి కొన్ని శతాబ్దాలకూ ఒక మలుపు వస్తుంది. అది నాగరికత దిశను, అభివృద్ధి వేగాన్ని, మనం ఆలోచించే, అర్థం చేసుకునే, పనిచేసే విధానాలను సమూలంగా మార్చేస్తుంది. మనం అటువంటి మార్పుల గుండా ప్రయాణిస్తున్నప్పుడు దాని అసలైన ప్రభావాన్ని అరుదుగా గుర్తిస్తాం. రాళ్లను రాపిడి చేసినప్పుడు తొలిసారిగా వచ్చిన నిప్పురవ్వలు నాగరికతకు పునాది అవుతాయని అప్పుడు ఎవరూ ఊహించలేదు. మాట లిపిగా మారినప్పుడు రాతపూర్వక జ్ఞానం భవిష్యత్ వ్యవస్థలకు వెన్నెముక అవుతుందని ఎవరూ అంచనా వేయలేదు. ఎలాంటి తీగలూ లేకుండా (వైర్‌లెస్) సంకేతాలు మొదటిసారి ప్రసారమైనప్పుడు.. ఏదో ఒకనాటికి ప్రపంచమంతా రియల్ టైమ్‌లో అనుసంధానమవుతుందని ఎవరూ ఊహించి ఉండరు. కృత్రిమ మేధ కూడా అలాంటి మార్పే. ఏఐ యంత్రాలను తెలివైనవిగా మారుస్తోంది. మానవ సామర్థ్యాన్ని అనేక రెట్లు పెంచుతోంది. అయితే.. ప్రస్తుత తరంతో పాటు, భవిష్యత్ తరాలకు మనం ఎటువంటి ఏఐని అందిస్తామో కూడా ఆలోచించాలి" అని పేర్కొన్నారు. ఏఐ పట్ల భారతదేశ దృక్పథాన్ని ఈ సదస్సు ఇతివృత్తం (సర్వజన హితాయ, సర్వజన సుఖాయ.. అంటే, అందరి సంక్షేమం, అందరి సంతోషం)లో స్పష్టంగా ప్రతిబింబిస్తుందని ఆయన స్పష్టం చేశారు. కృత్రిమ మేధను అందరితో పంచుకుంటేనే, దాని కోడ్ అందరికీ అందుబాటులో ఉంటేనే (డెమొక్రటైజేషన్) అది మానవాళికి నిజంగా మేలు చేయగలదని భారత్ విశ్వసిస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈమేరకు.. ఆయన కృత్రిమ మేధకు సంబంధించిన 'మానవ్' విజన్‌ను ఆవిష్కరించారు. "మానవ్‌లో ఎం అంటే.. మోరల్, ఎథికల్ సిస్టమ్స్. అంటే నైతిక విలువలు, మార్గదర్శకాల ఆధారంగా ఏఐ అభివృద్ధి చెందాలి. ఏ అంటే అకౌంటబిల్ గవర్నెన్స్ (జవాబుదారీపాలన). పారదర్శకమైన నిబంధనలు, పటిష్ఠ పర్యవేక్షణ ఉండాలి. ఎన్ అంటే నేషనల్ సావర్నిటీ (జాతీయ సార్వభౌమాధికారం). అంటే.. సృష్టించినవారికే డేటా చెందుతుంది. ఏ అంటే యాక్సెసిబుల్ అండ్ ఇంక్లూజివ్ (అందుబాటు, సమ్మిళితం). అంటే.. ఏఐపై ఏ ఒక్కరికో గుత్తాధిపత్యం ఉండకూడదు.

## పోలీసుల లాఠీతో కాంగ్రెస్ రాజకీయం!

**దాడులకు గురైన బీఆర్ఎస్ నేతలపైనే కేసులా?: హరీశ్**

**ఆదిలాబాద్ జైల్లో బాల్క సుమన్‌తో ములాఖత్**



**ఆదిలాబాద్, ఫిబ్రవరి 19**

ప్రజాతీర్పును కాదని పోలీసుల లాఠీతో కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయం చేస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని చోట్ల బీఆర్ఎస్ నేతలను బెదిరించేందుకే పోలీసులు కవాతులు నిర్వహిస్తున్నారని విమర్శించారు. అధికార పార్టీ అండదండలతో పోలీసులు, అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, వారికి భవిష్యత్తుల్లో ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టపగలే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుంటే రాజ్యాంగాన్ని పట్టుకుని తిరిగే రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. గురువారం ఆదిలాబాద్ జైల్లో చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో ఆయన ములాఖత్ అయ్యారు. అనంతరం జైలు బయట మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ నేతలపై దాడులు చేసి తిరిగి వారిపైనే ప్రభుత్వం అక్రమకేసులు బనాయించి జైల్లో పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్యాతన్‌పల్లి మునిసిపల్ ఎన్నికల్లో బీఆర్ఎ?సకు ప్రజలు భారీ మెజారిటీ ఇచ్చారని, మొత్తంగా 22 వార్డుల్లో 14వార్డులను బీఆర్ఎస్ కైవసం చేసుకుందన్నారు. దీన్ని అధికార కాంగ్రెస్ పార్టీ నేతలు జీర్ణించుకోలేకపోయారని, తొలిరోజు చైర్మన్ ఎన్నికను రసాభాస చేసి వాయిదా వేశారని, మహిళా కౌన్సిలర్లపై మంత్రి వివేక్ అనుచితంగా ప్రవర్తించినా పోలీసులు పట్టించుకోలేదని ఆరోపించారు.

## కేసీఆర్ ఎవరికి జాతిపిత?

**తెలంగాణ మీ అయ్య జాగీరా..?**

**కడియం శ్రీహరి ఘాటు వ్యాఖ్యలు**



స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 19

మాజీ సీఎం కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ నేతలపై సీనియర్ నేత, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'ఒకాయన మాజీ సీఎం కేసీఆర్‌ను జాతిపిత అంటున్నాడు. ఎవరికి జాతిపిత.. దేశానికి జాతిపిత మహాత్మాగాంధీ మాత్రమే. కానీ గాంధీజీని అవమాన పరిచేలా వీడెవ్వడో కొత్తగా జాతిపిత అని పేరు పెట్టుకుని రావడం విడ్డూరంగా ఉంది' అని వ్యాఖ్యానించారు. 'బీఆర్ఎస్ నాయకులు మీకు మీరే కేసీఆర్ జాతిపిత అనుకుంటే సరిపోతుందా. ప్రజలు అంగీకరించాలి కదా. జాతిపిత ఎక్కడ ఉంటున్నాడు. ఎక్కడ పడుకుంటున్నాడు ప్రజల్లోకి ఎందుకు రావడం లేదు.

## సిద్దిపేట నుంచి

# పోటీ చేస్తా..

**అక్కడ కాకపోతే బోధన్ మే నెలలో కొత్త పార్టీ.. సామాజిక తెలంగాణే లక్ష్యం**

**కొత్త తరానికి అవకాశాలు కల్పిస్తాం**

**ద్రోహులను పక్కనుంచుకొని ద్రోహాల గురించి కేటీఆర్ మాట్లాడటం విడ్డూరం**

**క్యాబినెట్ భేటీలు అప్పుడు ఎర్రవెల్లిలో.. ఇప్పుడు ఢిల్లీలో!**

**బీఆర్ఎస్ బాటలో కాంగ్రెస్ తెలంగాణలో బీజేపీ కనుమరుగయ్యే పరిస్థితి**

**జాగృతి అధ్యక్షురాలు కవిత**



హైదరాబాద్, పిబ్రవరి 19

"గతంలో క్యాబినెట్ సమావేశాలు ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో జరిగితే.. ఇప్పుడు ఢిల్లీ కాంగ్రెస్ కార్యాలయంలో జరుగుతున్నాయి. అంతే తేడా. బీఆర్ఎస్ వాళ్లు నేర్పిన దాన్ని కాంగ్రెస్ వాళ్లు మరింత ముందుకు తీసుకెళు న్నారు. బీఆర్ఎస్ మార్గంలోనే కాంగ్రెస్ నడుస్తోంది" అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. జాగృతి కార్యాలయంలో గురువారం మీడియా చిట్ చాట్‌లో ఆమె పలు అంశాలను ప్రస్తావించారు. ఉద్యమ ద్రోహులను తన పక్కనే పెట్టుకుని.. ద్రోహాల గురించి కేటీఆర్ మాట్లాడడం విడ్డూరంగా ఉందని, ఎవరు ఉద్యమకారులో, ఎవరు ఉద్యమ ద్రోహులో భవిష్యత్తులో ప్రజలే నిర్ణయిస్తారని అన్నారు. "ఆడవాళ్లు రాజకీయంగా ఎదగాల్సిన అవసరం లేదా? వైఎస్ షర్మిల రాజకీయంగా ఫెయిల్యూర్ కాదు.. ఆమె ఇప్పుడొక జాతీయ పార్టీకి రాష్ట్ర అధ్యక్షురాలు. ఆడవాళ్ల ఫెయిల్యూర్స్‌ను మాత్రమే పెద్దగా చూపించడాన్ని నేను ఒప్పుకోను. పార్టీ పెట్టి ఫెయిలైన పురుష నాయకుల గురించి ఎందుకు మాట్లాడారని ప్రశ్నించారు. చిరంజీవి, దేవేందర్‌గౌడ్ గురించి ఎందుకు ప్రస్తావించరు? కొత్త పార్టీ పెడతానని చెప్పి మళ్లీ కాంగట?స్రలో చేరిన రాజగోపాల్‌రెడ్డి గురించి మాట్లాడరేం? ఎంచుకున్న విధానాన్ని నమ్ముకొని నేను ముందుకెళ్తున్నా.. నా ప్రయత్నం నాది. రాజకీయ వర్గాలకే కాదు.. మీడియా వారినీ కోరుతున్నా.. చేతనైతే ప్రోత్సహించండి.. ఆడవారిని అవమానించకండి" అని విజ్ఞప్తి చేశారు. మే నెల మొదటి వారంలో ముహూర్తం చూసుకొని కొత్త పార్టీని ప్రారంభించనున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వెల్లడించారు. తెలంగాణ వాదమే తమ పార్టీకి మదర్ బోర్డు అని, రాజకీయంగా కొత్తతరానికి అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. ప్రజల కోణంలో సామాజిక తెలంగాణ లక్ష్యంగా పార్టీ ఏర్పాటు చేస్తామన్నారు.

# ఇలాగే పనిచేయండి

## ప్రభుత్వం-పార్టీ సమన్వయం బాగుంది.. సీఎం, మంత్రులు, పీసీసీ చీఫ్‌తో కాంగ్రెస్ అధిష్ఠానం

**మునిసిపల్, స్థానిక సంస్థల్లో విజయంపై అభినందనలు**

**తెలంగాణలో రెండేళ్ల పాలన, పార్టీ పనితీరుపై సంతృప్తి**

**సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వివరించిన రేవంత్**

**బీఆర్ఎస్ పనైపోయింది.. బీజేపీ బలహీనపడిందన్న సీఎం**

**ఆ రెండు పార్టీలను మరింతగా కట్టడి చేయండి**

**ఆరు గ్యారెంటీలతోపాటు హామీలన్నీ అమలు చేయండి**

**రేవంత్‌రెడ్డి, మహేశ్‌గౌడ్‌లకు రాహుల్, ఖర్గే సూచన**

**మేడారంపై జాతీయ స్థాయిలో సినిమా తీయాలి: రాహుల్**

**రెండు గంటలకుపైగా జరిగిన సమావేశం**

**రేవంత్, మహేశ్‌లతో ప్రత్యేకంగా రాహుల్, ఖర్గే భేటీ**



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19**

తెలంగాణలో రెండేళ్ల పాలనను కాంగ్రెస్ అధిష్ఠానం ప్రశంసించింది. పార్టీ పనితీరుపైనా సంతృప్తి వ్యక్తం చేసింది. ప్రభుత్వం, పార్టీ సమన్వయంతో పనిచేస్తున్నాయని కితాబిచ్చింది. ఇలాగే కలిసి ముందుకెళ్లాలని సూచించింది. మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించడంపై అభినందనలు తెలిపింది. 2029లో కేంద్రంలో అధికారంలోకి రావడం, పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయడంపై అధిష్ఠానం దృష్టి సారించింది. అందులో భాగంగా గురువారం ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధికారిక నివాసంలో తెలంగాణ నేతలతో ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్‌లు సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి హాజరయ్యారు. సుమారు రెండు గంటలకు పైగా జరిగిన ఈ సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన, పార్టీ పనితీరుపై కూలంకషంగా చర్చించారు. తెలంగాణలో రెండేళ్ల పాలనపై ప్రజలు సంతోషంగా ఉన్నారని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. మున్సిపల్, స్థానిక సంస్థల ఫలితాలే తమ పాలనకు రెఫరెండమని చెప్పారు. "తెలంగాణలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 30 లక్షలకు పైగా రేషన్ కార్డులు అందించాం. రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారి కార్డులు పంపిణీ చేశాం. అందరికీ సన్నబియ్యం అందిస్తున్నాం. ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాం. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళు నిర్మిస్తున్నాం. మహిళలకు ఉచిత బస్సు హామీని నెరవేర్చాం. గృహ అవసరాలకు ఉచిత విద్యుత్తు ఇస్తున్నాం. ఆరోగ్యశ్రీని రూ.10 లక్షలకు పెంచాం.

ప్రపంచ స్థాయిలో ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నాం. తెలంగాణ రైజింగ్‌లో భాగంగా రాష్ట్రంలోని ప్రతి నగరాన్నీ అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశాం" అని రేవంత్ వివరించారు. ప్రజలు సంతోషంగా ఉన్నారని.. అందుకే మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరుగులేని విజయాన్ని కట్టబెట్టారని చెప్పారు. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రజలు కాంగట?స్రకే పట్టం కట్టారన్నారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఆ రెండు స్థానాల్లో విజయం సాధించామని తెలిపారు. పాలనను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో గ్రేటర్ హైదరాబాద్‌ను మూడు కార్పొరేషన్లుగా విభజించామని చెప్పారు. 'మీ ప్రజెంటేషన్ బాగుంది. కానీ.. మంత్రులు, పీసీసీ చీఫ్ ఏమంటారు?' అని రాహుల్ ప్రశ్నించినట్లు తెలిసింది. ముఖ్యమంత్రి సారథ్యంలో సమష్టిగా పనిచేస్తున్నామని మంత్రులు చెప్పగా.. ప్రభుత్వం, పార్టీ సమన్వయంతో ముందుకెళ్తున్నాయని పీసీసీ చీఫ్ బదులిచ్చినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారెంటీలు సహా హామీలన్నీ అమలు చేయాలని అధిష్ఠానం సూచించినట్లు తెలిసింది. బీఆర్ఎస్, బీజేపీ పరిస్థితి ఏంటని రాహుల్ అడగ్గా.. బీఆర్ఎస్ పని అయిపోయిందని, బీజేపీ గతం కంటే మరింత బలహీనపడిందని సీఎం రేవంత్ వివరించినట్లు సమాచారం. కరీంనగర్ సంగతి ఏంటని రాహుల్ ప్రశ్నించగా.. ఆ ఒక్క స్థానంలోనే బీజేపీ గెలిచిందని, స్థానిక పరిస్థితుల ప్రభావంతో అలా జరిగిందని సీఎం, పీసీసీ చీఫ్ వివరించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. బీఆర్ఎస్, బీజేపీని మరింత కట్టడి చేయాలని రాహుల్ సూచించినట్లు సమాచారం. 2029 ఎన్నికలపై ఇప్పటి నుంచే దృష్టి సారించాలని చెప్పినట్లు తెలిసింది. ఇలాగే ప్రభుత్వం, పార్టీ కలిసి ముందుకు వెళ్లాలని, రాబోయే మూడేళ్లలో కాంగ్రెస్‌ను రాష్ట్రంలో తిరుగులేని శక్తిగా మార్చాలని సూచించినట్లు సమాచారం.

## 26 నుంచి బడ్జెట్ సమావేశాలు?

**15 రోజుల పాటు శాసనసభ**

**28న సభలో బడ్జెట్ ప్రవేశపెట్టే చాన్స్**

**హైదరాబాద్, ఫిబ్రవరి 19**

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 26 నుంచి ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. 26వ తేదీ నుంచి 15 రోజుల పాటు బడ్జెట్ సమావేశాలు నిర్వహించే అవకాశం కనిపిస్తుంది. తొలి రోజున గవర్నర్ ప్రసంగం, మరుసటి రోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ ఉండనుంది. అనంతరం ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఈ నెల 28వ తేదీన రాష్ట్ర బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. అయితే, పరిషత్ ఎన్నికల అంశంలో ప్రభుత్వ తర్జనభర్జన కొనసాగుతుండడంతో బడ్జెట్ సమావేశాల అంశంపై స్పష్టత రావడం లేదు. మార్చి 10వ తేదీ లోపు పరిషత్ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసి, ఆ తర్వాత బడ్జెట్ సమావేశాలకు వెళ్లాలన్న ప్రతిపాదన కూడా ప్రభుత్వ పరిశీలనలో ఉంది. ఈ నెల 23న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే మంత్రివర్గ సమావేశంలో ఆయా అంశాలపై తుది నిర్ణయం తీసుకుంటారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. నిజానికి, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో విజయం ఇచ్చిన ఉత్సాహంతో పరిషత్ ఎన్నికలకూ వెళ్లాలని సీఎం రేవంత్‌రెడ్డి భావించారు. కానీ, మార్చి 14వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆలోచనలో పడ్డారు. అయితే ఎన్నికల ప్రక్రియ ప్రారంభించి మార్చి 10 కల్లా పూర్తి చేస్తే పదో తరగతి పరీక్షలకు ఎలాంటి అడ్డం ఉండదనే అభిప్రాయాలు ప్రభుత్వ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో పరిషత్ ఎన్నికలను ఏప్రిల్ నెలకు వాయిదా వెయ్యాలా ? లేక పరీక్షలకు అడ్డు కాకుండా జాగ్రత్తలు తీసుకుని మార్చి 10 లోపున ఎన్నికల ప్రక్రియ ముగించాలా?అన్న అంశాలను పరిశీలిస్తున్నారు. ఎన్నికలను వాయిదా వేసిన పక్షంలో ఫిబ్రవరి 26 నుంచి బడ్జెట్ సమావేశాలను నిర్వహించాలన్న భావనలో ప్రభుత్వం ఉందంటున్నారు. ఈ నెల 23న జరిగే మంత్రివర్గ సమావేశంలో తుది నిర్ణయం వెలువడే అవకాశం అధికంగా ఉంది.

# ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్





**కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 19**
జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ గవర్నమెంట్ స్కూల్లోలో హరే కృష్ణా హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి కొలుకుల జగన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్యులు ఉచితంగా నిర్వహించిన డెంటల్ పరీక్షలను ఆయన ప్రారంభించారు. కోలుకుల జగన్ మాట్లాడుతూ గవర్నమెంట్ స్కూల్లో పిల్లలకు ఉచిత డెంటల్ చికిత్స చేయడం చాలా సంతోషకరం అలాగే విద్యార్థులకు పంటి రక్షణకు అవగాహన చేసిన డాక్టర్ హరి కి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం, కిషన్ నాయక్,హరే కృష్ణ హాస్పిటల్ డాక్టర్స్,హరి డాక్టర్ గణేష్,అనూష మౌనిక పూజిత మనోజ్ డాక్టర్ రాహుల్ నాయకులు భాను ప్రకాష్, సంతోష్ ప్రవీణ్ ఖయ్యూం సంపత్ రెడ్డి, సునీల్ రెడ్డి,చంద్రకళ, శైలజ,తదితరులు పాల్గొన్నారు.

# శివాజీ జయంతి వేడుకలు..





**రాయికల్, ఫిబ్రవరి 19:**
రాయికల్ పట్టణంలో సంఘమిత్ర యూత్ ఆధ్వర్యంలో, మండలంలోని అల్లీపూర్ గ్రామంలో గురువారం హైందవ స్వరాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి...ఆయన చేసిన యుద్దాలను, హిందు సామ్రాజ్యా స్దాపనకు చేసిన కృషిని గుర్తుచేసుకున్నారు. రాయికల్ మున్సిపల్ చైర్మన్ కటకం రవీందర్, వైస్ చైర్మన్ తరగ సౌజన్య శ్రీధర్ రెడ్డిలు మాట్లాడుతూ శివాజీ మహారాజ్ తన ధైర్యం, దూరదృష్టి, పరిపాలన నైపుణ్యంలో భారత చరిత్రలో చిరస్మరణీయ స్ధానం సంపాదించారని..ఆయన చూపిన మార్గం ఆదర్శనీయామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాల సుధాకర్ రెడ్డి, జిల్లాల సూర్యం రెడ్డి, పాలడుగు అనిల్, కుంభాల శ్రీనివాస్, జిల్లాల పెద్ద మల్లారెడ్డి, కడపటి రాజేందర్ రెడ్డి, ఎద్దండి భూమారెడ్డి, పడిగల రవీందర్, ఎద్దండి లింగారెడ్డి, కొయ్యడి మహిపాల్, గంగారెడ్డి, రాజారెడ్డి, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**శోభయాత్ర....**
పట్టణంలో శివాజీ జయంతి సందర్భంగా గురువారం సాయంత్రం బిజెపి పట్టణ శాఖ, హిందు సంఘాల ఆధ్వర్యంలో శివాజీ విగ్రహం నుండి... యువత ఆద్వర్యంలో పటేల్ విగ్రహం నుండి శోభయాత్ర నిర్వహించారు. వాహనాన్ని పూలతో అలంకరించి దానిపై శివాజీ మహారాజ్ విగ్రహన్ని ఉంచి బస్టాండ్...గాంధీ విగ్రహం మీదుగా డిజె పాటలతో, కాషాయ జెండాలతో, హిందుత్వ నినాదాలతో ర్యాలీ జరిగింది. బిజెపి నాయకులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, యువత తదితరులు పాల్గొన్నారు.

# కవిత పార్టీతో బీఆర్ఎస్ భూ స్థాపితం..

**హైదరాబాద్, ఫిబ్రవరి 19**
మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ ఏర్పాటు చేస్తే బీఆర్ఎస్ భూస్థాపితం అవుతుందని అనబోయి పొరపాటున బీజేపీ అని అన్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ భూస్థాపితం కాకుండా చూసుకోవాలని చెప్పారు. ఆమెను ఏ పార్టీ ఓడించిందో గుర్తుంచుకోవాలని అన్నారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాంచందర్‌రావు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాజకీయ చరిత్రలో మొట్టమొదటిసారిగా సొంతంగా కరీంనగర్‌లో మేయర్ పీఠాన్ని కైవసం చేసుకున్న సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని అభినందించారు. సంజయ్‌తో పాటు మేయర్ పీఠం కైవసం చేసుకునేందుకు కృషి చేసిన డిప్యూటీ మేయర్ సునీల్ రావు, ఎన్నికల ఇన్‌చార్జ్ మనోహర్ రెడ్డికి, ఎన్నికైన కార్పొరేటర్లకు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలో బీజేపీకి ఆదరణ పెరుగుతోందనడానికి మునిసిపల్ ఎన్నికల్లో పార్టీ సాధించిన విజయమే సంకేతమని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక మంది మేధావులు త్వరలో బీజేపీలో చేరేందుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలు, చిట్‌చాట్‌లతో పబ్బం గడుపుతూ పరిపాలన గాలికొదిలే శారని విమర్శించారు. తెలంగాణలో విద్యా వ్యవస్థను భ్రష్టుపట్టించారని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, రిటర్మెంట్ బెనిఫిట్స్ ఎందుకు ఇవ్వడం లేదో సమాధానం చెప్పాలని రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. ఎవరి వల్ల ఎవరు భూస్థాపితం అయ్యారో కవితకు తెలుసు ఎంపీ అర్విండ్ అన్నారు.

# అబ్బురం.. నేవీ సంబరం

**ఘనంగా ఇంటర్నేషనల్ సిటీ పరేడ్.. తీరంలో విన్యాసాలతో ఆకట్టుకున్న నేవీ**

**కనువిందు చేసిన హెలికాప్టర్లు, యుద్ధ విమానాలు**

**ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ అబ్దుల్ నజీర్**



**విశాఖపట్నం, ఫిబ్రవరి 19:**
విశాఖ సాగర తీరం బాంబు పేలుళ్లతో మోతె క్కింది..! వాయువేగంతో గగనతలంలో దూసుకెళ్లిన యుద్ధ విమానాలు రణభేరిని తలపించాయి...! వివిధ దేశాల ప్రతినిధులు ధవళ వస్త్రాలతో నిర్వహించిన కవాతు ఆహా అనిపించింది..! భారత నావికాదళం ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎ?ఫఆర్)లో భాగంగా గురువారం సాయంత్రం ఆర్‌కే బీచ్‌లో నిర్వహించిన ఈ సాహస విన్యాసాల ప్రదర్శన అబ్బురపరిచింది. ఈ కార్యక్రమానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరు కాగా... భారత నౌకాదళం అధినేత అడ్మిరల్ దినేశ్ త్రిపాఠి, తూర్పు నౌకాదళం చీఫ్ వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా పాల్గొన్నారు. సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమైన విన్యాసాలు అరగంట సేపు చూపుతిప్పుకోనివ్వలేదు. మూడు చేతక్ హెలికాప్టర్లు జాతీయ పతాకాలను ఆవిష్కరిస్తూ వేదిక ముందు నుంచి వెళ్లి కార్యక్రమాన్ని ప్రారంభించాయి. ఆ తర్వాత నేవీ వైమానిక దళం వినియోగిస్తున్న... సీ కింగ్-42 హెలికాప్టర్లు, కమోవ్-29 హెలికాప్టర్లు, కమోవ్-31 హెలికాప్టర్లు, ఎంహెచ్-60 ఆర్ హెలికాప్టర్లు, సీ కింగ్ హెలికాప్టర్లు ప్రదర్శన చేశాయి.

**మెరైన్ కమెండోల విన్యాసాలు**
ప్రత్యేక శిక్షణ పొందిన మెరైన్ కమెండోలు సీ కింగ్ హెలికాప్టర్ల నుంచి తాళ్ల సాయంతో సముద్రంలోకి దిగుతూ చేసిన విన్యాసాలు, హెలికాప్టర్ల ద్వారా చేసిన రెస్క్యూ ఆపరేషన్ సాహో అనిపించాయి. వివిధ దేశాల నేవీ సిబ్బంది నిర్వహించిన సిటీ పరేడ్ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టింది. ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఫ్రాన్స్, వియత్నాం, థాయ్‌లాండ్, ఇరాన్, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, సీషెల్స్, దక్షిణాఫ్రికా, శ్రీలంక తదితరదేశాల నేవీ ప్రతినిధులు కవాతులో పాల్గొన్నారు. కూచిపూడి, అరకు థింసా, తప్పెటగుళ్లు, గరగలు నృత్యాలు ఆకట్టుకున్నాయి. లేజర్ షో, డ్రోన్ షో, ఫైర్ వర్క్స్ అద్భుతం అనిపించాయి.

# సామాజిక న్యాయం ఎక్కడ?

మనది ప్రజాస్వామ్య దేశం. ప్రజలు ఇచ్చిన అధికారంతో అందరికీ సమన్యాయం కల్పిస్తామని, కుల, మత, ప్రాంత, లింగ, పేద--ధనిక భేదాలు లేకుండా రాజ్యాంగబద్ధంగా పాలన సాగిస్తామని ప్రజాప్రతినిధులు ప్రమాణం చేస్తారు. కానీ, జరుగుతున్నది ఏమిటి? అధికారంలోకి వచ్చే వరకు ఒక మాట, ఆ తర్వాత మరో మాట పాలకులకు అలవాటుగా మారింది. ఫలితంగా ప్రజలకు సమాన అవకాశాలు, సమన్యాయం దక్కడం లేదు. ఉపాధి అవకాశాలు సన్నగిల్లాయి. నిరుద్యోగం తీవ్ర రూపం దాల్చింది. రోజురోజుకూ ప్రజల మధ్య అంతరాలు పెరుగుతున్నాయి. ప్రపంచంలో చాలా దేశాలు అభివృద్ధిలో దూసుకుపోతుంటే.. మనం కుల, మతాల ఊబిలో కూరుకుపోతున్నాం. ఎవరైనా ప్రశ్నిస్తే అధికార పక్షం సహించలేకపోతోంది. కేసులు నమోదవుతున్నాయి. ఒకప్పుడు ప్రధాని, ముఖ్యమంత్రి ఒక మాట చెప్పారంటే.. అది ఒక శాసనం. ఎంతో విలువైనది. ఇచ్చిన మాట కచ్చితంగా అమలు చేస్తారన్న భరోసా ప్రజల్లో ఉండేది. కానీ ఏం జరుగుతోంది? వారి మాటకు విలువ తగ్గుతోంది. ప్రజా శ్రేయస్సు ముందు వారి ప్రచారకాంక్ష పతాక స్థాయికి చేరింది. కెమెరాల చూపును బట్టి వారి హావభావాలు, ప్రసంగాలు, నిర్ణయాలు ఉంటున్నాయి. ఇది విపరీత ధోరణి. ఇక బడ్జెట్ లెక్కలకు, వాస్తవ లెక్కలకు పొంతన ఉండడం లేదు. పార్లమెంట్, అసెంబ్లీల సాక్షిగా చెబుతున్న ఈ లెక్కలు గాడి తప్పుతున్నాయి. వీటిని కాగ్ నివేదికలు ధ్రువపరుస్తున్నాయి. బడ్జెట్ సమావేశాలంటే సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఎంతో ఆశగా ఎదురుచూసేవారు. తమ వర్గానికి, తమ ప్రాంతానికి ఏ విధమైన లబ్ధి చేకూరనుంది? ఏయే రంగాలపై ప్రభావం పడుతుంది? ఏ పథకాలకు కేటాయింపులు ఎలా ఉండబోతున్నాయి? కొత్త పథకాలు ఏమైనా వస్తున్నాయా? వంటి చర్చలు జరిగేవి. నేడు సామాన్యుల్లో ఆ ఉత్సుకత కొరవడింది. బడ్జెట్ అంటే కార్పొరేట్‌లకు, పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు ప్రధానమైంది. వారి ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నారు. ఇక క్యాబినెట్ సమావేశం ఏర్పాటు చేశారంటే.. ఇందులో కచ్చితంగా కార్పొరేట్, ప్రైవేటు వ్యక్తులకు లబ్ధి చేకూర్చే విధానపరమైన నిర్ణయాల కోసమేనని జరుగుతున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఇక సామాజిక న్యాయం ఎక్కడ లభిస్తుంది? ఇటీవల కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను, ఈ బడ్జెట్‌లో మధ్య తరగతి వర్గాలకు కేటాయింపులపై ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు వెంటనే ఆమె సమాధానం ఇవ్వలేకపోయారు. ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వీటిని గమనించినప్పుడు బడ్జెట్ ఓ ప్రహసనంగా మారిపోయింది. ప్రజాపాలన అంటే ఏవో ఒకటి, రెండు పథకాలు పేదల మొహాన కొట్టడం కాదు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం. ప్రశ్నించే తత్వాన్ని పాదుగొల్పడం. పేద, ధనిక వర్గాల మధ్య అంతరాలను తగ్గించడం. ప్రతి ఒక్కరికీ తిండి, గూడు, విద్య, ఉపాధి, ఆరోగ్యం మొదలైనవి కల్పించే విధంగా వ్యవస్థను రూపొందించడం. కానీ, పుట్టుకతో కుల, మత, లింగ పరమైన వివక్ష ఉన్న మన దేశంలో ఇది సాధ్యమేనా? ఓట్ల రాజకీయం నడుస్తున్నంత కాలం, ప్రశ్నించే వారిని అణగదొక్కుతున్నంత కాలం ప్రజల ఆర్థిక స్థితిగతులు మారవు. ఇవి మారకుంటే మేధో వికాసం జరగదు. ఆకలి, అనారోగ్యం జమిలిగా చుట్టేస్తాయి. పాలకులు ఒక వర్గానికే కొమ్ము కాస్తూ.. వారి ప్రయోజనాలే పరమావధిగా పాలన సాగిస్తున్న వర్తమానంలో కార్పొరేట్లు మరింత వృద్ధి చెందుతున్నారు. ఒక పరిశ్రమ ఏర్పాటు చేయాలంటే వారు అడుగుతున్న రాయితీలతో పాటు కోరిన కోర్కెలన్నీ తీర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీ పడుతున్నాయి. చిన్న, మధ్య తరగతి పరిశ్రమల ఏర్పాటు విషయంలోనూ, ఖాయిలా పడిన వాటికి ఇదే సూత్రం వర్తించాలి. వీరికీ రాయితీలు కల్పించాలి. అప్పుడే పారిశ్రామికీకరణలో సామాజిక న్యాయం జరుగుతుంది. స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. కానీ, వీటిపై పాలకులు ఎందుకో మక్కువ చూపరు. కార్పొరేట్లయితే ఎన్నికల వేళ కోట్లు కుమ్మరిస్తారు కదా! ఇదే విషయాన్ని ఎన్నికల బాండ్లు ధ్రువపరుస్తున్నాయి. 147 కోట్ల జనాభా ఉన్న సువిశాల భారతదేశంలో అప్పులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇవి సుమారు 200 లక్షల కోట్లకు చేరుకోనున్నాయి. అదే సమయంలో కార్పొరేట్ సంస్థల ఆదాయం వృద్ధి చెందుతోంది. వీరు ప్రపంచ ధనవంతులతో పోటీ పడుతున్నారు. దేశ సంపదలో 46శాతం, ఒక శాతం మంది దగ్గర గుట్టగా పడి ఉంది. పది శాతం మంది దగ్గర 75శాతం సంపద పోగు పడింది. మిగిలిన 90 శాతం మంది వద్ద కేవలం 25 శాతం సంపదే ఉంది. ఫోర్బ్స్ లెక్కల ప్రకారం, ప్రపంచంలోని టాప్--100 మంది సంపన్నుల్లో 25 మంది భారత్‌లోనే ఉన్నారు. 2025 నాటికి దేశంలో వంద కోట్లకు పైబడి సంపద ఉన్న సంపన్నులు 284 మంది వరకు ఉంటారని ఆ నివేదిక తేల్చింది. ఈ సంఖ్య ఏటికేడాది పెరుగుతూనే ఉంటుంది. అదే సమయంలో పేద, మధ్య తరగతి వర్గాల ప్రజల జీవన స్థితిగతులు రోజురోజుకూ దిగజారుతున్నాయి. వీరి పరిస్థితులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం సామాజిక న్యాయం పాటించాలి. సంపద పునఃపంపిణీ జరగాలి. కేంద్ర బడ్జెట్‌లో పేదలకు ఇచ్చే సబ్సిడీలు-- రాయితీలు 4--5 లక్షల కోట్లకు మించడం లేదు. బడ్జెట్‌లో పేదలు కట్టే పన్నులలో తగిన వాటా శ్రమజీవులు పొందాలి. ఎక్కువ సంపద ఉన్న వారిపై పన్నులు వేసి, పేదల సంక్షేమానికి ఖర్చు చేయాలి. పేదరిక నిర్మూలనకు ఈ మార్గాన్ని అనుసరించాలి. కానీ, అలా జరగడం లేదు. మోదీ పాలనలో కార్పొరేట్‌లపై పన్నును 35 నుంచి 22శాతానికి తగ్గించారు. సంపద పన్ను, వారసత్వ పన్ను చట్టాలను రద్దు చేశారు. కార్పొరేట్లకు 20 లక్షల కోట్ల రూపాయల రుణమాఫీ చేశారు. పేదలు, సామాన్యులపై మాత్రం పన్నుల వడ్డన కొనసాగుతూనే ఉంది. దీనిని ఏ రకంగా అర్థం చేసుకోవాలి? దేశంలో సామాజిక న్యాయం ఎక్కడ కనిపిస్తోంది?! ఐక్యరాజ్యసమితి 2009 నుంచి ఏటా ఫిబ్రవరి 20న ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. సమాజాల మధ్య సంఘీభావం, సామరస్యం, సమాన అవకాశాలను ప్రోత్సహించేందుకు పేదరికం, నిరుద్యోగాన్ని తొలగించేందుకు కావాల్సిన ప్రాముఖ్యతను గుర్తించడం దీని లక్ష్యం. భారత రాజ్యాంగం సైతం ఇదే విషయాన్ని బోధపరుస్తోంది. కానీ, మన ప్రభుత్వాలు వీటిని పట్టించుకోవడం లేదు. గౌతమ బుద్ధుడు చెప్పినట్లు 'నాయకుడు ఆదర్శంగా ఉండాలి. ధర్మపాలన సాగించాలి. హింసను తగ్గించాలి. శాంతి మార్గం పాటించాలి.' ప్రజలు పాలకుడిని నిశితంగా గమనించి, అనుసరిస్తారు. పాలకుడు ధర్మంగా ఉంటే ప్రజలు అలాగే ఉంటారు. పాలకుడు కుటిల ఆలోచనలతో ఉంటే ప్రజలు అదే మార్గం పడతారు. అది చివరకు పాలకుడి నెత్తిన భస్మాసుర హస్తంగా మారుతుంది. యథా రాజా తథా ప్రజా!

# ఇకపై గూగుల్ ఏఐ మీకు వచ్చే వ్యాధులను ఇలా చెప్పేస్తుంది..!



జన్యు పరిశోధన రంగంలో మరో కీలక అడుగు ముందుకు పడింది. గూగుల్ డీప్‌మైండ్ శాస్త్రవేత్తల కోసం ప్రత్యేకంగా రూపొందించిన కొత్త కృత్రిమ మేథస్సు సాధనం ఆల్ఫా జీనోమ్ ను విడుదల చేసింది. వ్యాధులకు కారణమయ్యే జన్యు మార్పులను గుర్తించడం, కొత్త చికిత్సల అభివృద్ధికి దోహదపడటం ఈ సాధన ప్రధాన లక్ష్యం. ఆల్ఫా జీనోమ్ ఒకేసారి దాదాపు పది లక్షల డీఎన్ఏ అక్షరాలను విశ్లేషించగల సామర్థ్యం కలిగి ఉంది. జన్యు మార్పులు జీన్‌ల పనితీరుపై ఎలా ప్రభావం చూపుతున్నాయి, ఏ కణాల్లో అవి క్రియాశీలకంగా మారుతున్నాయి, ఎంత స్థాయిలో పని చేస్తున్నాయనే అంశాలను ఇది అంచనా వేస్తుంది. హృద్రోగాలు, ఆటో ఇమ్యూన్ సమస్యలు, మానసిక ఆరోగ్య రుగ్మతలు, అనేక రకాల క్యాన్సర్లు వంటి సాధారణ వంశపారంపర్య వ్యాధులు ప్రోటీన్ తయారీ జీన్‌ల మార్పుల వల్ల కాకుండా, జీన్‌ల నియంత్రణలో వచ్చే మార్పుల వల్లే ఏర్పడుతున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అయితే ఏ మార్పు అసలు కారణమో గుర్తించడం ఇప్పటివరకు పెద్ద సవాలుగా మారింది.

**మానవ, ఎలుకల జన్యు డేటాతో శిక్షణ..**

ఈ సందర్భంగా డీప్‌మైండ్ పరిశోధకురాలు నటాషా లాటిషేవా మాట్లాడుతూ జీనోమ్ ఎలా పనిచేస్తుందో లోతుగా అర్థం చేసుకోవడానికి, జీవనాన్ని నియంత్రించే జీవ శాస్త్ర కోడ్‌పై పరిశోధనను వేగవంతం చేయడమే మా లక్ష్యం.. అని పేర్కొన్నారు. మనిషి జీనోమ్‌లో దాదాపు మూడు బిలియన్ల డీఎన్ఏ అక్షర జంటలు ఉంటాయి. ఇందులో కేవలం రెండు శాతం మాత్రమే ప్రోటీన్ల తయారీకి నేరుగా ఉపయోగపడతాయి. మిగతా భాగం జీన్‌లు ఎప్పుడు, ఎక్కడ, ఎంత మేరకు పని చేయాలో నియంత్రించే కీలక పాత్ర పోషిస్తాయి. ప్రజలకు అందుబాటులో ఉన్న మానవ, ఎలుకల జన్యు డేటాతో ఆల్ఫా జీనోమ్‌కు శిక్షణ ఇచ్చారు. దీని ద్వారా మెదడు, కాలేయం వంటి వివిధ అవయవాల్లో జన్యు మార్పులు జీవ ప్రక్రియలపై చూపే ప్రభావాన్ని అంచనా వేయగలుగుతోంది. ఈ సాధనం క్యాన్సర్‌తో పాటు ఇతర వ్యాధులకు సంబంధించిన కీలక జన్యు ప్రాంతాలను గుర్తించడంలో ఉపయోగపడుతుందని పరిశోధకులు భావిస్తున్నారు. అలాగే నిర్దిష్ట కణాల్లో మాత్రమే జీన్‌లు క్రియాశీలకంగా మారేలా డీఎన్ఏ క్రమాలను రూపకల్పన చేయడంలో సహాయపడుతూ, జీన్ థెరపీ అభివృద్ధికి కూడా దోహదపడే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. స్వతంత్ర నిపుణులు దీనిని జన్యు శాస్త్రంలో ఒక గొప్ప ముందడుగుగా అభివర్ణించినప్పటికీ, ప్రయోగశాల పరీక్షలకు పూర్తిస్థాయి ప్రత్యామ్నాయంగా మారేందుకు ఇంకా మరింత పరిశోధన అవసరమని సూచిస్తున్నారు.

# షుగర్ ఉన్నవారు ఈ మిల్లెట్లను తీసుకోవాలి..

### ఎంతో మేలు జరుగుతుంది..!



మధుమేహ వ్యాధి గ్రస్తులు ఆహారం తీసుకునే విషయంలో ప్రతిరోజూ ఒక సవాల్ ను ఎదుర్కొంటారని చెప్పవచ్చు. ఎందుకంటే వీరు తీసుకునే ఆహారం తక్షణమే రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుంది, అనారోగ్యానికి కూడా దారి తీస్తుంది. కనుక ఆహార విషయంలో మధుమేహ వ్యాధి గ్రస్తులు చాలా జాగ్రత్తగా ఉండాలి. చాలా మంది చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకోవడానికి చపాతీలను తీసుకుంటూ ఉంటారు. వీటిని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయని ఇవే సరైన ఆహారం అని నమ్ముతారు. అయితే ఇవే కాకుండా మిల్లెట్స్ తో చేసిన ఆహారాలను తీసుకోవడం మంచిదని వైద్యులు చెబుతున్నారు. చిరుధాన్యాలు తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ను కలిగి ఉంటాయి. దీంతో రక్తంలో చక్కెర స్థాయిలు వెంటనే పెరగకుండా ఉంటాయి. వీటిలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది కనుక నెమ్మదిగా జీర్ణమవుతాయి. దీంతో ఇన్సులిన్ సెన్సిటివిటీ పెరగడంతో పాటు స్థిరమైన శక్తి విడుదల అవుతుంది.

**సామలు..**

మిల్లెట్స్ అన్నీ మేలు చేసేవే అయినప్పటికీ సజ్జలు, సామలు, కొర్రలు అనే ఈ మూడు రకాల మిల్లెట్స్ మరింత మేలు చేస్తాయని వైద్యులు తెలియజేస్తున్నారు. ఈ మిల్లెట్స్ లో ఫైబర్ తో పాటు పోషకాలు, యాంటీ ఆక్సీడెంట్లు కూడా ఉంటాయని వీటిని తీసుకోవడం వల్ల మధుమేహ వ్యాధి గ్రస్తులకు ఎంతో మేలు కలుగుతుందని వారు సూచిస్తున్నారు. సామలు తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ను కలిగి ఉంటాయి. రక్తంలో గ్లూకోజ్ ను నెమ్మదిగా విడుదల చేయడంలో ఇవి సహాయపడతాయి. దీంతో రక్తంలో చక్కెర పెరుగుదల నివారించబడుతుంది. వీటిలో ఉండే అధిక ఫైబర్ గ్లూకోజ్ ను నియంత్రించడంతో పాటు ఇన్సులిన్ సెన్సిటివిటీని కూడా పెంచుతుంది. సామల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి మొత్తం శరీరానికి మేలు చేస్తాయి. వీటిలో ఫైబర్ అధికంగా ఉంటుంది కనుక జీర్ణశక్తి కూడా మెరుగుపడుతుంది. మలబద్దకం వంటి సమస్యలు తగ్గుతాయి.

**కొర్రలు..**

కొర్రలు వాటి తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కు, ఫైబర్ కు ప్రసిద్ది చెందాయని చెప్పవచ్చు. రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో, ఇన్సులిన్ నిరోధకతను తగ్గించడంలో ఇవి ఎంతో సహాయపడతాయి. వీటిలో పొటాషియం, మెగ్నీషియం వంటి ఖనిజాలు కూడా ఉంటాయి. కనుక కొర్రలను తీసుకోవడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. మంచి బ్యాక్టీరియాను పెంపొందించడంలో, జీర్ణక్రియను మెరుగుపరచడంలో, శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడంలో కూడా కొర్రలు మనకు సహాయపడతాయి.

**సజ్జలు..**

సజ్జల్లో మెగ్నీషియం, ఐరన్, క్యాల్షియం వంటి ఖనిజాలు ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల ఎముకలు దృఢంగా తయారవుతాయి. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇవి తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ను కలిగి ఉంటాయి. కనుక వీటిని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. అలాగే శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు కూడా తగ్గుతాయి. గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. వీటిని తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. ఆకలి నియంత్రణలో ఉంటుంది. దీంతో బరువు అదుపులో ఉంటుంది. డయాబెటిస్ తో బాధపడే వారు ఈ మూడు రకాల మిల్లెట్స్ ను ఆహారంగా తీసుకోవడం వల్ల చక్కెర స్థాయిలు ఎల్లప్పుడూ అదుపులో ఉంటాయి. శరీర మొత్తం ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. వీటితో తరచూ పాన్‌కేక్స్, కిచిడీ, పొంగల్, ఉప్మా, దోశ, ఇడ్లీ వంటి వాటిని కూడా తయారు చేసి తీసుకోవడం వల్ల రుచితో పాటు ఆరోగ్యాన్ని కూడా పొందవచ్చని వైద్యులు తెలియజేస్తున్నారు.


# నిద్రకు అరోమా థెరపీ



సోషల్ మీడియాలో రోజుకో ట్రెండ్‌ను వైరల్ చేస్తుంటారు. ఫలితాలు ఎలా ఉన్నా.. చాలామంది దాన్ని ఫాలో అవుతుంటారు. ప్రస్తుతం.. 'నిమ్మకాయ–ఉప్పు' కాంబినేషన్‌లో.. ఓ సరికొత్త అరోమా థెరపీ నెట్టింట తెగ ప్రచారంలో ఉన్నది. ఓ నిమ్మపండును కోసి, దానిపై కాస్తంత ఉప్పు చల్లి.. బెడ్ పక్కన పెట్టుకోవడం చాలామందికి రివాజుగా మారింది. ఈ థెరపీ వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఇన్‌ఫ్లూయెన్సర్లూ చెబుతున్నారు. గాలిలోని బ్యాక్టీరియాను నిమ్మకాయ పీల్చుకుని.. గాలిని శుద్ధి చేస్తుందని చెబుతున్నారు. నిమ్మకాయలోని 'లిమోనిన్' అనే పదార్థం.. మంచి సువాసనను అందిస్తుంది. రాత్రంతా ఈ సిట్రస్ వాసనను పీల్చడం వల్ల మనసుకు ప్రశాంతత లభిస్తుంది. ఒత్తిడి తగ్గి.. కంటినిండా నిద్ర పట్టే అవకాశం ఉంటుంది. జలుబు, సైనస్ ఉన్నప్పుడు.. ముక్కులు పట్టేస్తాయి. అదే నిమ్మ వాసన పీల్చడం వల్ల శ్వాస తీసుకోవడం తేలికగా అవుతుంది. అంతేకాకుండా, రాత్రంతా నిమ్మకాయ వాసన పీల్చడం వల్ల బీపీ కూడా తగ్గుతుందట. ఇక నిమ్మకాయ వాసన.. దోమలు, ఈగలు వంటి కీటకాలను దూరం కొడుతుంది. దాంతో దోమల బాధ తప్పుతుంది కూడా!

# ఈ అలవాట్లు మీకు ఉన్నాయా..

### అయితే మీ కిడ్నీల ఆరోగ్యం దెబ్బ తింటుంది జాగ్రత్త..!



మనం తీసుకునే ఆహారంపైనే మన శరీర ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకున్నప్పుడే శరీరంలోని అవయవాలతో సహా మొత్తం శరీరానికి మేలు కలుగుతుంది. అనారోగ్యకరమైన ఆహారం శరీరంలోని అవయవాలకు హానిని కలిగిస్తుంది. మనం తీసుకునే ఆహారం మూత్రపిండాల ఆరోగ్యాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. మూత్రపిండాలు రక్తాన్ని శుద్ధి చేసి అందులో ఉండే విష పదార్థాలను బటయకు పంపిస్తాయి. మూత్రపిండాల ఆరోగ్యం దెబ్బతింటే మొత్తం శరీర ఆరోగ్యం దెబ్బతింటుంది. మనం తీసుకునే ఆహారాలు కొన్ని మూత్రపిండాలపై ఒత్తిడిని కలిగించడంతో పాటు మూత్రపిండాల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఈ ఆహారాలను తీసుకోవడం వల్ల మూత్రపిండాల సమస్యలు తలెత్తుతాయి. మూత్రపిండాల ఆరోగ్యానికి హానిని కలిగించే ఆహారాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

**జంక్ ఫుడ్స్, ప్రాసెస్డ్ ఫుడ్స్..**

జంక్‌ఫుడ్ ను ఎక్కువగా తీసుకోవడం వల్ల మూత్రపిండాలపై ఒత్తిడి ఎక్కువగా పడుతుంది. వీటిలో ఉప్పుతో పాటు ప్రిజర్వేటివ్స్ ఉంటాయి. ఇవి మూత్రపిండాలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయి. ఫ్రెంచ్ ఫ్రైస్, ప్యాక్ చేసిన ఆహారాలు, పిజ్జా వంటివి మూత్రపిండాల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయని వైద్యులు చెబుతున్నారు. అలాగే మాంసంలో ప్రోటీన్ ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రోటీన్ మూత్రపిండాలపై ఒత్తిడిని పెంచుతుంది. మాంసాన్ని ఎక్కువగా తీసుకోవడం వల్ల మూత్రపిండాల పనితీరు తగ్గుతుంది. శరీరంలో యూరిక్ యాసిడ్ ఎక్కువగా తయారవు తుంది. ఇది మూత్రపిండాల వైఫల్యానికి దారి తీస్తుంది. కనుక మాంసాన్ని కూడా తక్కువగా తీసుకోవాలి. అదే విధంగా చక్కెర పానీయాలు, తీపి ఆహారాలు ఎక్కువగా తీసుకోవడం వల్ల కూడా మూత్రపిండాల ఆరోగ్యం దెబ్బతింటుంది. తీపి పదార్థాలు రక్తంలో చక్కెరను పెంచుతాయి. రక్తంలో ఎక్కువగా ఉండే చక్కెర స్థాయిలు మూత్రపిండాలకు హానిని కలిగిస్తాయి.

**పండ్లు, కూరగాయలు..**

వీటితో పాటు మనలో చాలా మంది సాసేజ్‌లు, బేకన్, ప్యాక్ చేసిన మాంసం, ప్రాసెస్ చేసిన, డీప్ ఫ్రై ఆహారాలను ఎక్కువగా తీసుకుంటున్నారు. ఇవి మూత్రపిండాల ఆరోగ్యాన్ని దెబ్బతీయడంతో పాటు బీపీ, ఊబకాయం వంటి ఇతర అనారోగ్య సమస్యలకు కూడా కారణమవుతాయి. ఇవన్నీకూడా మూత్రపిండాల ఆరోగ్యానికి హానికరం. కనుక ఈ ఆహారాలను తీసుకోవడం చాలా వరకు తగ్గించాలని వైద్యులు చెబుతున్నారు. ఈ ఆహారాలకు బదులుగా మూత్రపిండాలకు మేలు చేసే ఆహారాలను తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. పండ్లు, కూరగాయలు వంటి వాటిని తీసుకోవాలి. సమతుల్యమైన ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకునే ప్రయత్నం చేయాలి. రోజూ 8 నుండి 10 గ్లాసుల నీటిని తాగాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. శరీర బరువు అదుపులో ఉంచుకోవాలి. రక్తపోటు, డయాబెటిస్ వంటి వ్యాధులు అదుపులో ఉండేలా జాగ్రత్త వహించాలి. దీని వల్ల మూత్రపిండాలపై ఒత్తిడి ఎక్కువగా పడకుండా ఉంటుంది. మూత్రపిండాలకు సంబంధించిన పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. ఈ విధంగా సరైన ఆహారం, తగిన జాగ్రత్తలు తీసుకోవడం వల్ల మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, మూత్రపిండాలకు సంబంధించిన అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం కూడా తక్కువగా ఉంటుందని వైద్యులు తెలియజేస్తున్నారు.



## డబ్బుని అమితంగా ప్రేమిస్తా!

నటనతో ఇంప్రెస్ చేస్తూనే అందంతో ఆకట్టుకునే పాత్రలు కథానాయికలకు అరుదుగా దొరుకుతాయి. 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్' సినిమాలో కాయాదు లోహర్ పోషించింది ఆ తరహా పాత్రే. త్వరలో విశ్వక్‌సేన్ 'ఫంకీ' సినిమాతో ఈ అస్సాం చిన్నది తెలుగు ప్రేక్షకులను పలకరించనున్నది. ఇందులో పాత్ర కూడా అటు అందం, ఇటు అభినయం మేళవింపుగా ఉంటుందని చెబుతున్నది కాయాదు లోహర్. ఇటీవల ఈ పాత్ర గురించి ఆమె మాట్లాడుతూ 'ఇది సినిమా నేపథ్యంతో కూడిన కథ. ఇందులో నేను నిర్మాత కూతురుగా కనిపిస్తా. నా క్యారెక్టర్ పేరు చిత్ర. తండ్రి డబ్బుని ఆదా చేయాలని ఆశించే కూతురు పాత్ర. అంతేకాదు, మనీ మేనేజ్మెంట్ గురించి తను ఎక్కువగా మాట్లాడుతుంటుంది. డబ్బుని అమితంగా ప్రేమిస్తుంది. నిజంగా విభిన్నమైన పాత్రని చెప్పొచ్చు. విశ్వక్ ఇందులో డైరెక్టర్‌గా కనిపిస్తారు. మా ఇద్దరి కాంబినేషన్ సీన్స్ వినోదాత్మకంగా ఉంటాయి. దర్శకుడు అనుదీప్ రాసుకున్న కథలోనే తెలియని ఫన్ ఉంది. అదేంటో రేపు మీరు థియేటర్లలో చూస్తారు' అని తెలిపింది కాయాదు లోహర్. ఫిబ్రవరి 13న ప్రేమికుల రోజు కానుకగా ఈ సినిమా విడుదల కానున్న విషయం తెలిసిందే.



## ఆ హక్కు.. అందరికీ ఉంది!

తమ రూపాన్ని మెరుగుపరుచుకునే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని అంటున్నది బుల్లితెర నటి ప్రియాంక చాహర్ చౌదరి. సర్జరీలతో శరీరాన్ని నాజూకుగా మలుచుకున్నదంటూ.. ప్రియాంకపై కొద్దికాలంగా సోషల్ మీడియాలో విపరీతమైన ట్రోల్స్ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఓ జాతీయ మీడియాతో మాట్లాడుతూ.. తనపై వస్తున్న రూమర్లపై స్పందించింది ప్రియాంక. "సర్జరీలతో నా రూపాన్ని మార్చుకున్నానని కొందరు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు. చాలాకాలంగా ఇలాంటి మాటలు వింటూనే ఉన్నాను. కానీ, అవన్నీ వాస్తవాలు కాదు" అంటూ చెప్పింది. "గతేడాది నా ఆరోగ్యం బాగోలేక ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నాను. ఎక్కువ మోతాదులో యాంటి బయాటిక్స్ తీసుకోవాల్సి వచ్చింది. అయితే, చాలా మందికి ఈ విషయం తెలియదు. వాటి ప్రభావం వల్లే నేను బరువు తగ్గాను. నా ముఖంలోనూ కొద్దిగా మార్పులు వచ్చాయి. దానికే కొందరు ఏదేదో ఊహించుకుంటున్నారు. నాపై లేనిపోని ఆరోపణలు గుప్పిస్తున్నారు" అంటూ ఆవేదన వ్యక్తం చేసింది. ఇక ప్రతి ఒక్కరికీ తమ రూపాన్ని మెరుగుపరుచుకునే హక్కు ఉందనీ, అది పూర్తిగా వారి ఇష్టమేనని స్పష్టం చేసింది. "నేను కళ్లకు కాజల్ అద్దుకున్నా, లెన్స్ పెట్టుకున్నా.. ముఖానికి ఏదో చేయించుకున్నానని అనుకుంటారు. అందుకే నేను చెప్పేదేంటంటే.. నా ముఖం.. నా ఇష్టం!" అంటూ ఘాటుగా స్పందించింది. అయినా, తన ముఖానికి మేకప్ తప్ప ఏదీ చేయలేదనీ, అయినప్పటికీ కొందరు నమ్మడం లేదనీ వాపోయింది. ఇంకా ఏదేదో మాట్లాడుతూనే ఉంటారనీ, అలా గాసిప్స్‌ను ప్రచారం చేయడం సరైన పద్ధతికాదని హితవుపలికింది.

## పెళ్లి తర్వాత శోభిత-చైతూ జంట ప్లానింగ్ మాములుగా లేదు..



అక్కినేని కుటుంబంలో కొత్త అధ్యాయం మొదలైంది. సమంతతో విడాకుల తర్వాత నాగ చైతన్య జీవితంలోకి వచ్చిన శోభిత దూళిపాళ్ల ఇప్పుడు అక్కినేని ఇంటి పెద్ద కోడలిగా తన స్థానాన్ని సంపాదించుకుంది. పెళ్లి జరిగిన నాటి నుంచి శోభిత పేరు తరచూ వార్తల్లో వినిపిస్తూనే ఉంది. 2024 డిసెంబర్ 4న నాగ చైతన్య%--%శోభిత దూళిపాళ్ల వివాహం ఘనంగా జరిగింది. అతి కొద్దిమంది సన్నిహితులు, కుటుంబ సభ్యుల మధ్య జరిగిన ఈ పెళ్లి వేడుక అన్నపూర? స్టూడియోలోని అక్కినేని నాగేశ్వరరావు విగ్రహం ఎదుట జరగడం విశేషంగా నిలిచింది. ఈ వివాహానికి పలువురు సినీ ప్రముఖులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించగా, ఆ వేడుకకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో విస్త ృతంగా వైరల్ అయ్యాయి.

పెళ్లి తర్వాత నాగ చైతన్య కెరీర్ కూడా ఊపందుకుంది. శోభితతో వివాహానంతరం విడుదలైన 'తండేల్' చిత్రం భారీ విజయాన్ని అందుకోవడంతో ఇది చైతూ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. దీంతో అక్కినేని ఇంటికి శోభిత అడుగుపెట్టిన తర్వాత చైతూకు లక్ కలిసి వచ్చిందన్న మాటలు ఇండస్ట్రీలో వినిపించాయి. ఇదిలా ఉండగా పెళ్లి పూర్తై ఏడాది గడిచిన సందర్భేగా శోభిత తన ఆనందాన్ని వ్యక్తం చేయడం మరోసారి అభిమానుల ద ృష్టిని ఆకర్షించింది. ఈ నేపథ్యంలో నాగ చైతన్య%--%శోభిత ప్రస్తుతం నివసిస్తున్న ఇంటి గురించి ఆసక్తికర కథనాలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. పెళ్లి అయిన వెంటనే ఈ జంట హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 48లో ఉన్న ఓ లగ్జరీ హౌజ్‌లోకి షిఫ్ట్ అయ్యారని సమాచారం. ఈ ఇంటి విలువ దాదాపు రూ.45 కోట్ల వరకు ఉంటుందని టాక్. ఈ లగ్జరీ హౌజ్‌లో తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా గ్రీనరీ ఉండటంతో పాటు, ఒకప్పటి గ్రామీణ వాతావరణాన్ని గుర్తు చేసేలా డిజైన్ చేశారని తెలుస్తోంది. అన్ని గదుల్లో సహజ వెలుతురు పడేలా ఇంటి నిర్మాణం చేయగా, విశాలమైన వరండాలు, హోమ్ థియేటర్, లైబ్రరీ, జిమ్, స్విమ్మింగ్ పూల్ వంటి సౌకర్యాలతో ఈ నివాసం మరింత ప్రత్యేకంగా మారింది. పెళ్లికి ముందే నాగ చైతన్య, శోభిత ఇద్దరూ కలిసి తమ అభిరుచులకు తగ్గట్టుగా ఈ ఇంటిని ప్లాన్ చేసుకున్నారని, ఇందులో నాగార్జున పెద్దగా జోక్యం చేసుకోలేదని ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ నడుస్తోంది.



## అప్పటి ప్రేమలే గొప్పవి..

90ల నాటి ప్రేమలే ఎంతో గొప్పవనీ, వాటినే తాను బలంగా నమ్ముతానని అంటున్నది బాలీవుడ్ బ్యూటీ అనన్య పాండే. నేటితరం ఫాలో అవుతున్న డేటింగ్ ట్రెండ్స్, ఆధునిక హుక్‌అప్ సంస్కృతికి తాను పూర్తిగా వ్యతిరేకమని చెబుతున్నది. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. వ్యక్తిగత జీవితం, ఫ్యామిలీ వ్యాల్యూస్ గురించి తన అభిప్రాయాలను పంచుకున్నది. తాను కుటుంబానికి, ఫ్యామిలీ ఎమోషన్స్‌కి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తానని వెల్లడించింది. "నేను నా కుటుంబాన్ని ఎంతో ప్రేమిస్తున్నా. నా భాగస్వామి కూడా అలాగే ఉండాలని ఆశిస్తున్నా. అంతేకాదు.. అతని కుటుంబం కూడా నా కుటుంబంలాగే మారాలని కోరుకుంటున్నా!" అంటూ.. ఫ్యామిలీ ఎమోషన్స్ గురించి చెప్పుకొచ్చింది. పాతకాలం నాటి సాంప్రదాయ ప్రేమకథలంటే తనకు ఎంతో నమ్మకమనీ.. అదే తాజా సినిమాలో తాను పోషించిన రూమీ పాత్రకు తనను మరింత దగ్గర చేసిందనీ అంటున్నది. అనన్య మాటలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఈ సందర్భంగా పలువురు నెటిజన్లు.. అనన్య పాండేపై వచ్చిన డేటింగ్ రూమర్స్‌ను గుర్తుచేస్తున్నారు. ఇషాన్ ఖత్తర్, కార్తిక్ ఆర్యన్, ఆదిత్యరాయ్ కపూర్ వంటి స్టార్లతో డేటింగ్ ముచ్చట్ల గురించీ చెప్పాలని కామెంట్లు పెడుతున్నారు. బాలీవుడ్ సీనియర్ నటుడు చుంకీ పాండే కూతురైన అనన్య.. హిందీ పరిశ్రమలో అత్యంత పాపులర్ హీరోయిన్లలో ఒకరిగా గుర్తింపు తెచ్చుకున్నది. తన గ్లామర్, స్టయిల్, ఫ్యాషన్ స్టేట్‌మెంట్స్‌తో దేశవ్యాప్తంగా భారీ ఫ్యాన్ ఫాలోయింగ్‌ను సంపాదించుకున్నది.